# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటి

## పత్రికా ప్రకటన

## భారత విప్లవోద్యమ నిర్మూలనకై శత్రువు తలపెట్టిన విప్లవ ప్రతీఘాతుక నూతన వ్యూహాత్మక దాడి 'సమాధాన్' ఓడించండి!

## పీఎల్‌జీఏ 17వ వార్షికోత్సవాన్ని డిశంబర్ 2 నుండి 8 వరకు విప్లవోత్సాహంతో జరపండి!

**ప్రియమైన ప్రజలారా, కామ్రేడ్స్!**

భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) నాయకత్వంలో ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ఏర్పడి 17 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర కమిటీ సమస్త పీఎల్‌జీఏ వీర గెరిల్లాలకు, విప్లవాభిమానులకు, కమాండర్లకు, కమాండ్లకు, కమీషన్‌లకు, అన్ని స్థాయిల పార్టీ కమిటీలకు ప్రజా మిలీషియా కార్యకర్తలకు విప్లవాభివందనలు తెలియచేస్తున్నది. 2016 డిసెంబర్ నుండి 2017 నవంబర్ 17 వరకు కొనసాగిన ప్రజా యుద్ధంలో దాదాపు 150 మందికిపైగా కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాలను ధారపోశారు. వారిలో 35 మంది కామ్రేడ్స్ మహిళలున్నారు. వీరందరి త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకై తుదివరకు బోల్షెవిక్ సంకల్పంతో పోరాడుతామని శపథం చేద్దాం. వారందరికీ పేరు పేరునా విప్లవ జోహార్లర్పిద్దాం. ప్రజాయుద్ధంలో క్షతగాత్రులైన కామ్రేడ్స్ అందరూ త్వరగా కోలుకొని తిరిగి రణరంగంలో తమ బాధ్యతలను చేపడుతారని కేంద్ర కమిటీ విశ్వసిస్తోంది.

గత సంవత్సర కాలంలో మన పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కుప్పు దేవరాజ్ మరియు పార్టీ మాజీ కేంద్ర కమిటీ, పోలిట్ బ్యూరో సభ్యుడు, వెటరన్ కామ్రేడ్ నారాయణ సన్యాల్‌లను కోల్పోయింది. కామ్రేడ్ అజితతో సహా రాష్ట్ర స్థాయి, డివిజన్, జిల్లా, ఏరియా స్థాయి నాయకత్వ కామ్రేడ్స్, సాధారణ పార్టీ కార్యకర్తలు, వీర గెరిల్లాలు, విప్లవ ప్రజాసంఘాల, జనతన సర్కార్ల, ప్రజా మిలీషియా కార్యకర్తలు, విప్లవ ప్రజానీకం ప్రజా యుద్ధాన్ని కొనసాగిస్తూ, దాని పురోగమనానికై అనేకమంది తమ ప్రాణాలను ధారపోశారు. వారు లేని లోటు, వారి ఆశయాల సాధనకై పోరాడుతూ, వారి ఆదర్శాల స్ఫూర్తితో వేనవేల నూతన శక్తులను ఉద్యమంలో చేర్చుకుంటూ పురోగమించడానికి వర్తమాన విప్లవ పరిస్థితులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవడం ద్వారానే తీర్చుకోగలం.

కేంద్రంలో గద్దెనెక్కిన బ్రాహ్మణీయ ఫాసిస్టు శక్తులు మన పార్టీతో సహా దేశంలో తమ న్యాయమైన సమస్యలపై పోరాడుతున్న వారందరిపై తీవ్రమైన అణచివేత చర్యలను కొనసాగిస్తున్నది. కశ్మీర్‌లో గత 10 నెలల కాలంలో దాదాపు 150 మంది పోరాటకారులను భారత సైన్యాలు కాల్చి చంపాయి. ఈశాన్య భారతంలో పోరాడుతున్న వారిని అనేకమందిని భారత సైనికులు కాల్చి చంపారు. దేశంలో కేవలం సాయుధంగా ప్రతిఘటిస్తున్న వారిననే కాకుండా గిట్టుబాటు ధరలు అడిగిన మధ్య ప్రదేశ్ రైతాంగంపై పోలీసులు కాల్పులు జరిపి ఐదుగురిని పొట్టన పెట్టుకున్నారు. అత్యంత పాశవికమైన అణచివేత చర్యలకు పోలీసు, అర్ధసైనిక బలగాలు పూనుకుంటున్నాయి. కశ్మీర్‌లో భారత సైనికులు యువకుడిని జీబు బొయ్‌నెట్‌పై కూచోబెట్టి కట్టేసి 12 కి.మీ. ఊరేగించారు. మహిళలపై అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు పోరాట ప్రాంతాలంతటా సాధారణమయ్యాయి. మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో ఆస్తుల విధ్వంసం, గృహ దహనాలు కొనసాగుతూనే ఉన్నాయి. అయినా ప్రజలు తమ న్యాయమైన పోరాటాలను గొప్ప త్యాగసంసిద్ధతతో కొనసాగిస్తున్నారు.

దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని అణచడానికి మిషన్-2016 ఓటమి పాలయ్యాక, పోలీసు, అర్ధసైనిక బలగాలు చేపట్టిన మిషన్-2017 ప్రారంభంలోనే దండకారణ్యంలో కొత్తచెరువు, బుర్కపాల్, కారంపల్లి లాంటి భారీ ప్రజా సైనిక చర్యలలో పోలీసు, అర్ధ సైనిక బలగాలు ఖంగుతిన్నాయి. ఒడిశాలో రామగూడా తదనంతరం గెరిల్లాలు కొనసాగించిన సైనిక ప్రతిఘటన చర్యలలో మంచి ఫలితాలు సాధించారు. తెలంగాణలో, ఒడిశాలో, మధ్యప్రదేశ్-మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్ మొదలైన రాష్ట్రాలలో గెరిల్లాలు తమ ప్రజా యుద్ధ చర్యలను కొనసాగిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. గడచిన సంవత్సర కాలంలో మావోయిస్టు ప్రజాయుద్ధంలో దాదాపు 110 మంది పోలీసు, అర్ధసైనిక బలగాలు గెరిల్లాల చేతిలో మట్టిగరవగా, అంతకు మించిన సంఖ్యలో దాదాపు 150 మంది గాయపడినారు. ఈ మధ్య భారత రాష్ట్రపతి

రాంనాథ్ కోవింద్ నవంబర్ 5 నాడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అవతరణ ముగింపు వేడుకలలో పాల్గొని ఛత్తీస్‌గఢ్‌లో గత 17 ఏళ్లలో 1100కు పైగా పోలీసు, అర్ధసైనిక బలగాలు మరణించడంపై గుండెలు బాదుకుంటూ తన వర్గ స్వభావాన్ని చాటుకున్నాడు. కానీ ఈ 17 సంవత్సరాల కాలంలో ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే అంతకు మూడురెట్లు ప్రజలు, గెరిల్లాలు విప్లవాశయ సాధనలో ప్రభుత్వ బలగాల పాశవిక హత్యాకాండలో అసువులు బాసిన చరిత్రను మనం సదా స్మరించుకుందాం.

విప్లవోద్యమ ప్రాంతాలలో ప్రజా గెరిల్లాల దాడులలో ప్రాణాలు కోల్పోతున్న ప్రభుత్వ బలగాల మానసిక స్థైర్యం దినదినం ఎంతగానో దెబ్బతింటున్నది. పోలీసు ముఖ్యంగా అర్ధ సైనిక బలగాలలో అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పరస్పరం హత్యలు చేసుకుంటున్నారు. కొలువులకు స్వచ్ఛంద పదవీ విరమణలు ప్రకటిస్తున్నారు. ఉద్యమ ప్రాంతాలలో చాలా మంది తమ ఉద్యోగాలలో చేరడానికి సిద్ధపడడం లేదు. వీటిని అదుపు చేయడానికి కేంద్రం అనేక చర్యలు చేపడుతోంది. అన్నింటిలోకి ముఖ్యమైనది ఖాకీల ప్రాణాల ఖరీదును కోట్లకు పెంచడమే వారు చేయగలుగుతున్నది. కాకపోతే వారికి అనేక సౌకర్యాల భ్రమలు గుప్పించడం చేస్తున్నారు. కళా వ్యాపారి సినీ నటుడు అక్షయ కుమార్, క్రీడా వ్యాపారి సైనా నెహవాల్, గౌతం గంభీర్ లాంటి వాళ్లు తమ కళా, క్రీడా వ్యాపార సంపదలో నుండి అతి స్వల్ప మొత్తాలను భద్రతా బలగాల శవాలపై కప్పుతూ వారిని ప్రజలపైకి ఉసిగొల్పడంలో తమ వంతు పాత్ర తాము నిర్వహిస్తున్న కొత్త వైనం ముందుకు వస్తున్నది. దోపిడీ వర్గాలు భద్రతా బలగాల మానసిక స్థైర్యాన్ని నిలబెట్టడానికి ఎన్ని కుట్రలు-కుతంత్రాలు; భ్రమలు-ఆకర్షణలకు పూనుకున్నా ప్రజా యుద్ధం దోపిడీకి వ్యతిరేకంగా, అజేయంగా సాగుతుందని నిరూపిద్దాం. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన భద్రతా బలగాలు ప్రజా యుద్ధంలో భాగం కావాలనీ ప్రజలపై, గెరిల్లాలపై తుపాకులు ఎక్కుపెట్టకూడదనీ మా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.

**ప్రియమైన ప్రజా సైనికులారా, ప్రజలారా, ప్రజాస్వామికవాదులారా!**

గతంలో సల్వాజుడుం, సేంద్ర, హర్మద్‌బాహిని లాంటి ప్రభుత్వ ప్రాయోజిత శ్వేత మూకల దాడులను ఓడించాం. గత ఎనిమిదేళ్లుగా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌తో తలపడుతున్నాం. అందులోని రెండు దశలను ఓడించి మూడవ దశను గట్టిగా ప్రతిఘటిస్తున్నాం. ఎంతో నెత్తుర్లను ధారపోస్తూ అనేక కొత్త అనుభవాలను సంపాదిస్తున్నాం. వరుసగా ఓటమి పాలవుతున్న దోపిడీ పాలక వర్గాలు ప్రస్తుతం 'సమాధాన్' వ్యూహంతో (2017-22) రంగంలోకి దిగాయి. ఇది అత్యంత కీలకమైన సమయంగా దేశ వ్యవహారాల మంత్రి రాజనాథ్ సింగ్ ఇటీవల హైద్రాబాద్‌లో ప్రకటించాడు. ఔను, ఇది చాలా కీలకమైన సమయమే. ఈ సమయంలో మనం మున్నెన్నటికన్నా ధైర్య సాహసాలతో పోరాడుదాం. పోరాడకుండా ఉద్యమాలను నిలబెట్టుకోలేమనీ, పురోగమింపచేయలేమనీ 50 ఏండ్ల నక్సల్బరీ మనకు నేర్పింది. ఎంతటి గడ్డు (ఆటు) పరిస్థితులనైనా పోరాటాల ద్వారా అధిగమిస్తామన్న విశ్వాసాన్ని వందేళ్ల బోల్షెవిక్ విప్లవ అనుభవాలు అందిస్తున్నాయి. ఆ విశ్వాసంతో, కంటకప్రాయమైన మలుపులు, మెలికలతో కూడిన విప్లవ పథంలో పురోగమిద్దాం.

- ✪ **పీఎల్‌జీఏ స్థాపనా వారం చివరన డిశంబర్ 6 నుండి మొదలయ్యే హిందూ ఫాసిస్టు వ్యతిరేక కార్యాచరణ వారంలో చురుగ్గా పాల్గొని డిశంబర్ 12 నాడు భారత్ బంద్‌ను జయప్రదం చేద్దాం.**
- ✪ **పీఎల్‌జీఏ 17వ వార్షికోత్సవాలను విప్లవోద్యమ ప్రాంతాలంతటా సమరోత్సాహంతో జరుపుకుందాం!**
- ✪ **'సమాధాన్' యోజనను ఓడిద్దాం!**
- ✪ **బ్రాహ్మణీయ ఫాసిస్టు శక్తుల దాడులకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడుదాం!**
- ✪ **సామ్రాజ్యవాద, దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాల దోపిడీని అంతం చేద్దాం!**
- ✪ **భూస్వామ్య-బూర్జువా దోపిడీ సంస్కృతికి ఘోరీ కడుదాం! నూతన ప్రజాస్వామిక సంస్కృతిని నలుమూలలా పెంపొందిద్దాం!**
- ✪ **పీఎల్‌జీఏ జిందాబాద్!**
- ✪ **సిపిఐ (మావోయిస్ట్) జిందాబాద్!**

**విప్లవాభి వందనాలతో**

**అభయ్**

Abhay

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ**

**16 నవంబరు 2017**

**భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు)**